సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 7 । మార్చి । 2023



గవర్నర్ గారు.. స్పందించండి

కొత్తపల్లిలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న బొక్కల కంపెనీని మూసివేయాలని బీజేపీ శ్రేణులు గవర్నర్‌కు లేఖ రాశారు. 8లో ▸



అడగకున్నా సంక్షేమ పథకాలు

ప్రజలు అడగకపోయినా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో ▸

రేపు సాలార్‌జంగ్ మ్యూజియం మూసివేత

చార్మినార్: హోలీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 8న (బుధవారం) సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ప్రకటించారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలని మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం యథావిధిగా సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

ఇబ్రహీంపట్నం: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రోడ్డురవాణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అనామికతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు రూపుమాపాలంటే మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వాన్ని ఆసరాగా చేసుకొని ప్రగతికి బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అశోక్‌రాజు, న్యాయవాదులు సీహెచ్ రవి, జగన్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా భూ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

కందుకూరు: సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భూ పోరాటాలు నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదల బతుకులతో ఆటలాడటం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇంటి జాగా ఇస్తానని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మరోవైపు ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి మాట్లాడుతూ.. ఎర్రజెండా ఎప్పుడూ కష్టజీవులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సీపీఐ మండల కమిటీ కన్వీనర్‌గా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాజు, బ్రహ్మచారి, నారాయణ, శివకుమార్, నరసింహ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 60 అర్జీలు అందాయి. అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వెంటనే పరిష్కార మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లపై గరంగరం

- సమస్యలపై నిలదీసిన సభ్యులు
- అధికారుల పనితీరుపై ఆగ్రహం
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'వివిధ జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున డిప్యూటేషన్లపై జిల్లాకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొంది.. అర్బన్ ఏరియాల్లో ఇంటికి సమీపంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదు శాతం మాత్రమే ఉండాల్సిన నాన్‌లోకల్స్ 60 శాతం దాటారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయే ప్రమాదం ఉంది. తక్షణమే డిప్యూటేషన్లు నిలిపివేయాలి. జిల్లావాసులకు అన్యాయం జరగకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉంది' అని తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నీరజ, యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య సహా పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డగోలు డిప్యూటేషన్లకు ఎలా అనుమతిస్తారని నిలదీశారు. సోమవారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంత్రి సబితారెడ్డి, షాద్‌నగర్, కల్వకుర్తి, చేవెళ్ల ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఉద్యోగుల డిప్యూటేషన్లపై వాడివేడి చర్చ జరిగింది. మంత్రి సబితారెడ్డి జోక్యం చేసుకుని స్పౌజ్ కేసులు, కోర్టు కేసులకు మినహా ఇతర బదిలీలకు అవకాశం కల్పించడం లేదని స్పష్టం చేశారు. జిల్లా నిరుద్యోగ అభ్యర్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

వివాదాస్పదమైన 'షో' కామెంట్

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మనఊరు మనబడి'లో భాగంగా చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, పనులు చేసేందుకు ఆర్ అండ్ బీ అధికారులు నిరాకరిస్తున్నారని యాచారం ఎంపీపీ సుకన్య సభ దృష్టికి తేగా.. కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించే అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోమని మంత్రి పేర్కొన్నారు.
- ఇదే అంశంపై తలకొండపల్లి ఎంపీపీ నీరజ మాట్లాడుతుండగా కడ్తాల్ జెడ్పీటీసీ దశరథ నాయక్ అడ్డు తగిలారు. సమావేశంలో మీరు 'షో' చేస్తున్నారంటూ మహిళా సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో సదరు మహిళా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మంత్రి చొరవతో గొడవ సద్దుమణిగింది.

దాతలపై ఆంక్షలా?

- ఏదైనా స్వచ్ఛంద సంస్థ, పూర్వ విద్యార్థులు, పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పిల్లలకు పుస్తకాలు, డ్రెస్సులు, పెన్నులు, ఇతర వస్తువులు బహూకరించేందుకు ముందుకు వస్తే డీఈఓ సుశీందర్ రావు సహా ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు అడ్డుకుంటున్నారని.. ఇది ఎంత వరకు సమంజసమని తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రశ్నించారు. స్పందించిన మంత్రి పాఠశాలలకు విరాళాలు ఇచ్చే దాతలకు ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందని, ఇచ్చే విరాళాలను బట్టి స్కూలు గదులకు వారి పేర్లు పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. పార్టీ గుర్తులు, రంగులతో సంబంధం లేకుండా ఎవరైనా ఏదైనా వస్తువును స్కూలుకు విరాళంగా ఇవ్వొచ్చని స్పష్టం చేశారు.
- కడ్తాల్ జెడ్పీహెచ్‌ఎస్ ఎదురుగా మురుగు నీరు నిల్వ ఉంటోందని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు సభ దృష్టికి తెచ్చారు.
- లష్కర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ఇటీవల దాన్ని కూల్చివేయడం జరిగిందని, ఆ స్థానంలో కొత్తగా మరో భవనం నిర్మించాలని, కుత్బుల్లాపూర్ జెడ్పీ స్కూల్లో బయాలజీ టీచర్ లేడని, వెంటనే ఆ పోస్టు భర్తీ చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ జెడ్పీటీసీ దాసు సభ దృష్టికి తేగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రి హామీకి విలువ లేదా?

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హామీకి కూడా జిల్లాలో విలువలేకుండా పోయిందని, రోగుల నిష్పత్తికి తగినంత మంది వైద్యసిబ్బందిని నియమించాలని పదేపదే విజ్ఞప్తి చేసినా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు.
- షాద్‌నగర్ ఏరియాలో రోడ్డు ప్రమాదాలతో పాటు, ప్రసవాలు కూడా ఎక్కువ జరుగుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో సర్జరీ చేసేందుకు వైద్యులు లేరని పేర్కొన్నారు. ట్రామా సెంటర్, డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు చేయకపోగా ఇక్కడ పని చేస్తున్న వైద్యులను ఇతర ప్రాంతాలకు ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. అనస్థీషియా వైద్యుడు లేకపోవడంతో సర్జరీలకు విఘాతం కలుగుతోందన్నారు.
- జిల్లేడు చౌదరిగూడలో పల్లె దవాఖానా ఏర్పాటు చేయాలని కోరినా ఇప్పటికీ వైద్యులను నియమించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తేకపోవడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు.
- షాబాద్‌లో ఆస్పత్రి కోసం భవనం కట్టి ప్రారంభించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ఎమ్మెల్యే యాదయ్య ప్రశ్నించారు.

ముంపు నుంచి విముక్తి కల్పించండి

- కొంతమంది రియల్టర్లు శంషాబాద్ మండలం అంచమడుగు కాల్వ పూడ్చివేత పనులు చేపడుతున్నారని, తమ గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని కేబీ దొడ్డి గ్రామస్తులు మంత్రి సబితారెడ్డికి ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆమె వారికి హామీ ఇచ్చారు.

రూ.100 కోట్లతో బీటీ రోడ్లు..

జిల్లాలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందని ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్యాచ్ వర్క్‌లు చేపట్టామని, ఆయా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, ప్రస్తుతం కొత్తగా 170 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్లు వేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జూన్ చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 నుంచి 15 ఎకరాలున్న రైతులకు రైతు బంధు పడలేదని, రెండు విడతల్లో రుణమాఫీ అయిన రైతుల నుంచి కూడా బ్యాంకర్లు బలవంతగా డబ్బులు వసూలు చేస్తున్నాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. బ్యాంకర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డిని ఆదేశించారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళా ఓ మొక్క నాటి సమాజానికి గిఫ్ట్ ఇవ్వాలని మంత్రి సబిత సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా జెడ్పీటీసీ, ఎంపీపీలు, జిల్లా అధికారులతో కలిసి కేక్‌కట్ చేశారు.

మట్టి డంప్ చేసిన వారిపై కేసు నమోదు

మాసబ్ చెరువును సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువును సోమవారం ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. 'మాసబ్ చెరువుపై రియల్ కన్ను' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. చెరువులో మట్టి డంప్ చేస్తున్న బూరుగు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై సోమవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పోలీసు బృందం తుర్కయంజాల్ సర్వే నంబర్ 205లోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. డంప్ చేసిన మట్టిని తొలగించడానికి ట్రాక్టర్లు, జేసీబీలను ఏర్పాటు చేసినప్పటికీ, మట్టి డంప్ చేసిన వారు అడ్డుకోవడం, చీకటి పడుతుండటంతో అంతా వెనుదిరిగారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ ఏఈఈ గంగమ్మ 'సాక్షి'తో మాట్లాడుతూ హైకోర్టు నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి డంప్ చేయడం, నిర్మాణాలు చేపట్టడం వంటి పనులు చేపట్టకూడదని అన్నారు. మంగళవారం నుంచి డంప్ చేసిన మట్టిని తొలగించే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



మట్టి డంప్ చేసిన ప్రాంతం వద్ద అధికారుల బృందం

సీటీఓ యాప్ ద్వారా పంటల వివరాల నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: సీటీఓ యాప్ ద్వారా పంటల వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర గణాంక శాఖ సంయుక్త సంచాలకుడు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్‌లో సోమవారం పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీటీఓ యాప్‌లో పంటల వివరాల నమోదుకు వచ్చే అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.

ఫీవర్.. ఫియర్



నగరంలో కొత్త రకం ఫ్లూ లక్షణాలు

- హెచ్3ఎన్2 వైరస్‌తో జలుబు, జ్వరాలు
- ఫీవర్ ఆస్పత్రికి పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ఇష్టారీతిన యాంటీ బయాటిక్స్ వాడొద్దని సూచన

నల్లకుంట: నగరంలో కొద్ది రోజులుగా వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయి. దీనికి తోడు కొత్తగా హెచ్3ఎన్2 వైరస్ ఫ్లూ లక్షణాలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కోవిడ్- 19 వైరస్ మహమ్మారి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వేళ కొత్త వైరస్ హెచ్3ఎన్2 కలకలం రేపుతోంది. పలువురు జ్వరం, ఫ్లూ లక్షణాలతో కూడిన హెచ్3ఎన్2 వైరస్ బారిన పడుతున్నారు. పైకి జ్వరం, జలుబుగా మాత్రమే కనిపిస్తున్న ఈ వైరస్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)తో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తంగా ఉండాలంటూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పలు సూచనలు చేశాయి. హెచ్3ఎన్2 కొత్త వైరస్ ప్రభావంతో ప్రస్తుతం ప్రతి ముగ్గురిలో ఒకరికి జ్వరం, దగ్గు గొంతు నొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. వైరల్ ఫీవర్ బాధిత రోగులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. చాలా మందిలో అవి తీవ్రంగా.. దీర్ఘకాలికగా ఉంటున్నాయి. కొందరిలో కొన్ని రోజుల తర్వాత న్యుమోనియాగా మారి శ్వాసకోశ ఇబ్బందులకు గురి చేస్తోంది.

అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ

జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు, గొంతు నొప్పి వంటి లక్షణాలతో అనేక మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రెండు వారాలుగా దీర్ఘకాలిక అనారోగ్యాలు, దీర్ఘకాలిక దగ్గుతో కూడిన ఫ్లూ వైరస్ బారిన రోగులు చికిత్స కోసం నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి వస్తున్నారు. వీరిలో కొందరికి స్వైన్ ఫ్లూ హెచ్3ఎన్2 వైరస్ లక్షణాలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్సలు పొందుతూ పై లక్షణాలు ఉన్న రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి హెచ్3ఎన్2 వైరస్ పరీక్షల కోసం నారాయణ గూడ ఐపీఎంకు పంపిస్తున్నారు. హెచ్3ఎన్2 లక్షణాలు ఉన్న మరికొందరు రోగులకు హోం ఐలేషన్‌లోనే ఉండి ఐదు రోజుల పాటు మందులు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇన్‌ఫ్లూయెంజా 'ఎ' ఉపరకం హెచ్3ఎన్2 వైరస్ కారణంగానే ఇలా జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇతర ఉప రకాల కంటే ఎక్కువగా హెచ్3ఎన్2 వైరస్ జనాన్ని ఆస్పత్రుల పాలు చేస్తున్నట్టు చెబుతున్నారు.



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఓపీ క్యూ లైన్‌లో వైరల్ ఫీవర్ బాధితులు

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- ఫ్లూ లక్షణాలు ఉన్న వాళ్లు ఇతరులతో కరచాలనం, ఆలింగనం, దగ్గరగా కూర్చోవడం, కలిసి భోజనం చేయకూడదు.
- లక్షణాలున్న వాళ్లు బహిరంగ ప్రదేశాలలో ఉమ్మి వేయడం చేయకూడదు.
- స్వీయ వైద్యం వద్దు. వైద్యుడి సూచనల మేరకు మాత్రమే మందులు వాడాలి.
- బహిరంగ ప్రదేశాల్లో, సమూహాల్లో ఉన్నప్పుడు విధిగా మాస్కులు ధరించాలి.
- తరచుగా చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

15 లోపు.. 50 ఏళ్లు పైబడిన వారిలో..

కొత్త రకం ఫ్లూ ఇన్ఫెక్షన్ సాధారణంగా ఐదు నుంచి వారం రోజులు ఉంటుంది. మూడు రోజుల్లో జ్వరం తగ్గిపోతుంది. దగ్గు మూడు వారాల వరకు ఉంటుంది. 15 ఏళ్ల లోపు పిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారు ఈ ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం కూడా కేసుల పెరుగుదలకు కారణమవుతోంది. ఇష్టారాజ్యంగా యాంటీబయోటిక్స్ వాడకం మంచిది కాదు, ఇది సహజ రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తుంది. వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు వాడాలి. ఫ్లూ బారిన పడకుండా ముందు జాగ్రత్తగా చేయించుకునే వ్యాక్సిన్ అన్ని ప్రైవేట్ మెడికల్ షాపుల్లో రూ. 600 ధరకు అందుబాటులో ఉంది.

అత్యధికంగా వైరల్ ఫీవర్ బాధితులే..

నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి రోజుకు 500 నుంచి 750 మంది రోగులు వస్తే వారిలో సగం మంది జ్వర పీడితులే ఉంటున్నారు. అదే విధంగా బస్తీ దవాఖానాలకు కూడా వైరల్ ఫీవర్ కేసులే వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

వైద్యులను సంప్రదించకుండా యాంటీబయోటిక్స్ వాడకూడదు

వైద్యులను సంప్రదించకుండా యాంటీ బయోటిక్స్ వాడకూడదని మరోవైపు ఇన్‌ఫెక్షన్‌లను నిర్ధారించుకోకుండా రోగులకు యాంటీ బయాటిక్స్ సూచించకూడదని వైద్యులను ఐసీఎంఆర్ హెచ్చరించింది. ఫ్లూ నుంచి కోలుకున్నాక కూడా దీర్ఘకాలిక ప్రభావం ఉండొచ్చని, ఈ వైరస్‌తో ఆందోళన చెందవద్దని సూచించింది.

వెల్‌నెస్ సెంటర్‌కు..

ఖైరతాబాద్, నాంపల్లి: ఖైరతాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌కు జ్వర పీడితుల తాకిడి అకస్మాత్తుగా పెరిగిందని అక్కడి సిబ్బంది తెలిపారు. నిలోఫర్‌లోనూ వైరల్ ఫీవర్‌తో వస్తున్నవారి సంఖ్య పెరిగింది.

మహిళా శక్తి ఎంతో గొప్పది

షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష



కేక్ కట్ చేస్తున్న డీఎం ఉష, మహిళా ఉద్యోగులు

షాద్‌నగర్‌రూరల్: సమాజంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని డిపో ఆవరణలో సోమవారం మహిళా కండక్టర్లు, ఉద్యోగులు, మహిళా ప్రయాణికులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం ఉష మాట్లాడుతూ.. మహిళలు ఒకవైపు ఇంటి బాధ్యతలను మోస్తూనే గృహిణిగా, ఉద్యోగులుగా రాణించడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని, అప్పుడే వారిలో వివక్ష పోతుందన్నారు. సమాజంలో ఎదురయ్యే సంఘటనలకు ఆడ పిల్లలు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మహిళలు మగవారికి దీటుగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. మహిళా ప్రయాణికులను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలిచే పరిస్థితి లేదని, బీజేపీ ఎనిమిది సీట్లకు మించి గెలవదని జోస్యం చెప్పారు. మున్సిపల్ పరిధిలోని 3వ, 4వ వార్డుల్లో సోమవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. మహేశ్‌గౌడ్‌తోపాటు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం చటాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం దొరల గడీల్లో బందీ అయిందని, కాంగ్రెస్‌తోనే విముక్తి కలుగుతుందన్నారు. రూ.పదహారు వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం రూ.ఐదున్నర లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. రూ.లక్షా 20వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.50వేల కోట్ల కమీషన్లను కేసీఆర్ దండుకున్నారని ఆరోపించారు. బంగారు తెలంగాణ అవుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని, దోచుకున్న సొమ్ముతో సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రం బంగారు కుటుంబంగా మారిందన్నారు. దేశంలో ప్రధాని మోదీ ధన దోపిడీకి పాల్పడుతూ అదానీ, అంబానీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతుండగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు భూ దోపిడీకి పాల్పడుతూ లక్షల కోట్లు సంపాదిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్ బాబర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, కౌన్సిలర్ రాయికల్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, మసూద్ అలీఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, నర్సింహయాదవ్, కొమ్ము కృష్ణ, సీతారాం, అశోక్, చిల్కమర్రి నర్సింలు, పురుషోత్తంరెడ్డి, అంజియాదవ్, శేఖర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అడగకున్నా సంక్షేమ పథకాలు



కొహెడలో ఎమ్మెల్యేకు మేక పిల్లను బహూకరిస్తున్న కురుమ సోదరులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి

- నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.2,950 కోట్లు

హయత్‌నగర్: ప్రజలు అడగకపోయినా పేద ప్రజల అవసరాలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. బీఆర్ఎస్ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రను పురస్కరించుకుని ఆదివారం రాత్రి తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కొహెడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్‌కిట్, వృద్ధాప్య పింఛన్లు, దళితబంధు లాంటి పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.2,950 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కొహెడాలో తాగునీటిని అందించేందుకు రూ.16 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆసియాలోనే పెద్దదైన పండ్ల మార్కెట్ ఇక్కడికి రావడంతో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని తెలిపారు.

ఉమర్‌ఖాన్‌గూడలో..

ఉమర్‌ఖాన్‌గూడలో జరిగిన సభలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో శ్మశాన వాటిలో స్నానపు గదుల నిర్మాణం కోసం రూ:10 లక్షలు, అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్ల నిర్మాణం కోసం రూ: 5లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేముల అమరేందర్‌రెడ్డి, బల్‌దేవ్‌రెడ్డి, ప్రభువర్ధన్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంలో ఒకరి రిమాండ్

యాచారం: ఆన్‌లైన్ మోసాలపై నాలుగు రోజులుగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యాచారం గ్రామానికి చెందిన సుషియన్‌తో మరో కొంత మందిపై కేసులు నమోదు చేశారు. మరో ఇద్దరి కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. వీరిని అదుపులోకి తీసుకుంటే గుట్టు మొత్తం బయటకు వస్తుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తును మహేశ్వరం డీసీపీ శ్రీనువాస్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఎండీ సుషియన్‌ను సోమవారం రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆన్‌లైన్ మోసం కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రదీప్ కుటుంబానికి నష్టపరిహారం

సాక్షి, సిటీబ్యూరో: అంబర్ పేట్ వీధి కుక్కల దాడిలో మరణించిన నాలుగేళ్ల ప్రదీప్ కుటుంబానికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి రూ.9,71,900 ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రదీప్ తండ్రి గంగాధర్‌కు చెక్కు అందజేశారు. దీంతోపాటు లోయర్‌ట్యాంక్ బండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రగాయాలైన యు.చంద్ర, యు.సురేష్‌లకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.4 లక్షల చెక్కులను అందజేశారు.

గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తి నుంచి సుమారు ఆరు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా నాగిలిగిద్ద మండలం సక్రుం నాయక్ తండాకు చెందిన రాథోడ్ శంకర్ సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో శంకర్‌పల్లికి చేరుకున్నాడు. పోలీసులు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండడగా.. రాథోడ్ శంకర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగులో 6కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గవర్నర్ గారు.. మీరైనా స్పందించండి



నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు



ఉత్తరాన్ని పోస్టుడబ్బాలో వేస్తున్న నాయకులు

కొత్తపల్లి బొక్కల కంపెనీ మూసివేయాలంటూ గవర్నర్‌కు లేఖ

యాచారం: కొత్తపల్లిలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న బొక్కల కంపెనీని మూసివేయాలని గ్రామస్తులు 30 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. గ్రామస్తులకు మద్దతుగా సోమవారం బీజేపీ మండల కమిటీ బృందం నిరాహార దీక్షలో పాల్గొన్నారు. బొక్కల కంపెనీ మూతపై స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినా.. అన్ని శాఖల అధికారులు వచ్చి బొక్కల కంపెనీ వల్ల దుర్వాసన వస్తుంది నిజమేనని తెలియజేసినా నేటికి కంపెనీని మూయకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులకు మద్దతు తెలిపిన బీజేపీ శ్రేణులు గవర్నర్ తమిళిసై లేఖ రాశారు. మేడం మీరైనా స్పందించి కొత్తపల్లి గ్రామస్తుల కష్టాలు తీర్చాలని ఆ లేఖలో పేర్కొన్నారు. యాచారంలోని తపాలా కార్యాలయం నుంచి లేటర్ పంపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు గోగికార్ రమేష్, విజయకుమార్, పుప్పాల శాంతికుమార్, గొల్లపల్లి శ్రీధర్‌గౌడ్, పల్లపు నరేష్, పత్తి రాజు, నడికుడి కృష్ణ, శ్రీనువాస్‌గుప్త, గంగల శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

శంకర్‌పల్లి: క్రీడల్లో యువత రాణించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందించారు. ఇరుకుంట తండాకు చెందిన యువకులు మొదటి బహుమతి, రెండో మోకిల గ్రామానికి చెందిన యువకులు గెలుపొందారు. వీరికి రూ.లక్ష, రూ.50 వేల చొప్పున అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి దోహదపడుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అన్ని హంగులతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, మోకిల పీఏసీస్ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేష్, మోకిల పీఏసీఎస్ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



తిమ్మిడి రాజు (ఫైల్)

పహాడీషరీఫ్: మద్యం ఎందుకు తాగుతున్నావని సోదరుడు మందలించాడని ఓ యువకుడు అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ డి.అజయ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంఖాల్ గ్రామానికి చెందిన రమేశ్ కుమారుడు తిమ్మిడి రాజు(21) గత నెల 18న ఉదయం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇది గమనించిన అతని సోదరుడు ఎందుకు తాగావని మందలించాడు. దీంతో రాజు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి ఎంతకి తిరిగి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై సోదరుడు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో, లేక 94906 17241 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష



నిందితుడు నరేశ్

రంగారెడ్డి కోర్టులు: భార్య బలవన్మరణానికి కారణమైన భర్తకు రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.హరేకృష్ణ భూపతి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఏపీపీ సి.రాము కథనం ప్రకారం.. దేరంగుల శిరీష (19), నరేశ్ అలియాస్ వడ్డె నరేశ్ భార్యాభర్తలు. పెళ్లయి ఏడాదికి రూ.లక్ష అదనపు కట్నం కోసం భార్యను వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లింది. నరేశ్ అక్కడికి వెళ్లి కూడా మానసికంగా వేధించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు 2019 మేలో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన కోర్టు.. సోమవారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మీర్‌పేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లెనిన్‌నగర్‌లోని ఓ ఇంట్లో నుంచి సోమవారం ఉదయం మంటలు రావటాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది ఇంటి వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, దుస్తులు, ఇతర వస్తువులు కాలిపోయాయని ఎస్ఐ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

వీడియో పోస్టు చేశాడని..

విద్యార్థిని చితకబాదిన హెచ్ఓడీ

మీర్‌పేట: తరగతి గదిలో తీసిన వీడియోను కళాశాల గ్రూపులో పోస్టు చేసినందుకు గాను ఓ విద్యార్థిని హెచ్ఓడీ చితకబాదిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన బుగ్గ ప్రదీప్‌కుమార్ కుమారుడు దాక్షిణ్యదీప్ (17) టీకేఆర్ కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజుల క్రితం హెచ్ఓడీ మహేష్ తరగతి గదిలో ఓ విద్యార్థి చొక్కా గుండీలు విప్పి హాస్యం (మజాక్) చేస్తున్న దృశ్యాలను దాక్షిణ్యదీప్ 'పాలిటెక్నిక్ ఫ్రెండ్స్ వాట్సాప్ గ్రూప్'లో శనివారం పోస్టు చేయగా వీడియో కాస్తా వైరల్ అయింది. విషయం తెలుసుకున్న హెచ్ఓడీ మహేష్ అదే రోజు సాయంత్రం ఆటోక్యాడ్ ల్యాబ్‌లో వీడియోను తీసి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడన్న కారణంతో దాక్షిణ్యదీప్‌పై దాడి చేశాడు. దీంతో పాటు సోమవారం కూడా హెచ్ఓడీ మహేష్ మళ్లీ విద్యార్థిపై దాడి చేసి చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన దాక్షిణ్యదీప్ ఈ విషయాన్ని తండ్రికి చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో.. కంగారు పడ్డ తండ్రి వెంటనే దాక్షిణ్యదీప్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాడు. ఈ సంఘటనపై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

'రాంకీ' రిజిస్ట్రేషన్లపై స్టే

- తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆపాలన్న హైకోర్టు.. 23కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం శ్రీనగర్ విలేజ్‌లోని సర్వే నెంబర్ 227లోని రాంకీ ఇంటిగ్రేటెడ్ నిర్మించిన డిస్కవరీ సిటీ, గార్డెనియా గ్రోవ్ విల్లాస్ తదితర ప్రాజెక్టుల విల్లాలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేస్తూ ద్వి సభ్య ధర్మాసనం స్టే ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్‌ను అనుమతించాలని గత సంవత్సరం సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) సవాల్ చేయగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. -2008లో హెచ్ఎండీఏ, రాంకీల మధ్య డెవలప్‌మెంట్ ఒప్పందం కుదిరింది. 400 ఎకరాల్లో 375 ఎకరాల ప్రైవేట్ భూముల సేకరణకు ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత అగ్రిమెంట్‌ను విత్‌డ్రా చేసుకున్నాయి. అగ్రిమెంట్ అమలు కోసం రాంకీ సంస్థ రూ.100 కోట్లు చెల్లించేందుకు ముందుకొచ్చి రూ.25 కోట్లను తొలివిడతగా చెల్లించింది. మరో రూ.75 కోట్లు చెల్లించాల్సి ఉంది. వంద ఎకరాల్లో చేపట్టిన విల్లాలను, ప్లాట్లను అమ్మేందుకు రాంకీ ప్రయత్నిస్తే అగ్రిమెంట్‌కు వ్యతిరేకమని చెప్పి హెచ్ఎండీఏ రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాసింది. రిజిస్ట్రేషన్లను ఆపడంపై రాంకీ ఇన్‌ఫ్రా, రాంకీ ఎస్టేట్స్ అండ్ ఫామ్స్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, రిజిస్ట్రేషన్లకు సింగిల్ జడ్జి అనుమతించిన విషయం తెలిసిందే. గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలపై ఇద్దరు రైతులు కూడా అప్పీల్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లోనూ సింగిల్ జడ్జి ఆదేశాలపై స్టే కొనసాగుతోంది. ఇకపై రెండు అప్పీళ్లను కలిపి విచారణ చేపడతామంటూ, తదుపరి విచారణను ద్విసభ్య ధర్మాసనం ఈ నెల 23కు వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు



మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

చేవెళ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం చేవెళ్ల డివిజన్‌లో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ వేణుమాధవ్‌రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ నాలుగు మండలాల పరిధిలో మొత్తం 370 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఈనెల 13న జరగనున్నాయని తెలిపారు. ఆయా మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఉంటాయని చెప్పారు. 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికలు మొత్తం బ్యాలెట్ పేపర్ ద్వారానే జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. పోలింగ్ అధికారులను, సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఉంటుందని చెప్పారు.

వేదిక్ మ్యాథ్స్‌లో జ్యోతికి మొదటి బహుమతి



జ్యోతిని అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ అల్లాజీగౌడ్

ఆమనగల్లు: విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ఆమనగల్లు లిటిల్‌స్కాలర్స్ టెక్నోస్కూల్ 7వ తరగతి విద్యార్థిని జ్యోతి జిల్లా స్థానంలో నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో 20 పాఠశాలల నుంచి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొనగా జ్యోతి మొదటి బహుమతి సాధించింది. దీనితో జ్యోతిని పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, డైరెక్టర్ సావిత్రిలు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో అకాడమిక్ అడ్వయిజర్ సుదర్శన్ రెడ్డి, కరస్పాండెంట్ సుజాతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.